క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



జాగ్రత్తలు చెబుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా, ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం బాగుంటుందని డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక గడ్డవీధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఒకసారి తప్పకుండా పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా పొడి వాతావరణం ఉంచుకోవడం ద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. అపరిశుభ్ర వాతావరణం ఉంటే దోమలు పెరిగి గుడ్లు పెడతాయని, అవి దోమలుగా మారి ప్రమాదకరమైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా లాంటి వ్యాధులకు కారణమవుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ సాత్విక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సద్గురు దత్త కృపాలయానికి జేసీబీ



జేసీబీని ప్రారంభిస్తున్న సద్గురు దత్త గౌరవాధ్యక్షురాలు కృష్ణకుమారి, సభ్యులు

కర్నూలు కల్చరల్: స్థానిక సద్గురు దత్త కృపాలయం సేవలను విస్తృతం చేస్తున్నామని సద్గురు దత్త కృపాలయం అధ్యక్షులు మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం సద్గురు దత్త కృపాలయం వ్యవస్థాపకులు చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో శ్మశానవాటికల్లో పార్థివ దేహాల పూడ్చివేత నిమిత్తం కొనుగోలు చేసిన జేసీబీని సద్గురు దత్త కృపాలయం గౌరవాధ్యక్షురాలు కృష్ణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ 13 ఏళ్లుగా సంస్థ తరపున జమ్మిచెట్టు సమీపంలోని శ్మశాన వాటిలో ఉచితంగా పూడికలు, కాష్టాలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ సేవలు అందించే సామర్థ్యం కోసం పూడికలు తీసేందుకు వీలుగా జేసీబీని కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు డి.రాకేష్, జి.నిర్మలారెడ్డి, కార్యదర్శి పి.శ్రీధర్ గుప్త, సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల జెండాలకు పెయింట్ వేయడం అన్యాయం

కర్నూలు(సెంట్రల్):నియోజకవర్గంలో పలు చోట్లా కార్మిక సంఘాల జెండాలకు ఎన్నికల ప్రవర్తన నియమావళి పేరుతో మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ రంగులు వేసి కప్పి పెడుతున్నారని, ఇది అన్యాయమని సీపీఎం ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఎం నాయకులు కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగంలో ఫిర్యాదు చేశారు. కార్మిక సంఘాల జెండాలకు సుత్తి కొడవలి గుర్తులు ఉంటాయని, సీపీఎం జెండాలో సుత్తి కొడవలి నక్షత్రం ఉంటుందన్నారు. అధికారులు ఈ మార్పును గమనించి కార్మిక సంఘాల జెండాలకు కలర్ వేయకుండా చూడాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

కర్నూలు (టౌన్): ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించి రాజకీయ పార్టీ సమావేశంలో పాల్గొన్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కె.రమేష్‌ను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ విధుల నుంచి తొలగించారు. ఈనెల 21న రాజకీయ పార్టీ నిర్వహించిన సమావేశంలో రమేష్ పాల్గొన్నాడనే ఫిర్యాదుపై విచారణ చేసి రుజువు కావడంతో శుక్రవారం తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భగత్‌సింగ్ వర్ధంతిని వీధివీధినా నిర్వహించండి

కర్నూలు(సెంట్రల్): భగత్‌సింగ్ వర్ధంతిని వీధివీధినా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు డి.రాఘవేంద్ర, వై.నగేష్, రంగప్ప సూచించారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లను సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడటంతో ఉరి శిక్షకు గురయ్యారని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. నాయకులు అమర్, గోవర్దన్ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

కర్నూలు సిటీ: స్థానిక బంగారుపేటలో ఉన్న కర్నూలు డిగ్రీ కాలేజీలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి అయిన వారితో పాటు పది, ఇంటర్, ఐటీఐ విద్యార్హత ఉన్న 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. పిరామల్ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, నవ భారత్ ఫర్టిలైజర్, ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్ కంపెనీల్లో సేల్స్, అసిస్టెంట్ మేనేజర్, రీజినల్ మేనేజర్ ఉద్యోగ అవకాశాలకు మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు,రెజ్యూమ్, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు.



కర్జూరాలు కొనుగోలు చేస్తున్న ముస్లింలు



కలింగర పండ్ల వద్ద సందడి





ఫలహారాలు కొనుగోలు చేస్తున్న దీక్షాపరులు



మటన్ హలీం పార్శిల్ కడుతున్న దృశ్యం



సమోసాలు, పెరుగు వడ తయారు చేస్తూ..





పెద్దపార్క్ సమీపంలో చికెన్ హలీం తయారు చేస్తున్న ముస్లింలు



రంజాన్ సందడి

నగరంలో ఎక్కడ చూసినా రంజాన్ సందడి కనిపిస్తోంది. ఘుమఘుమలాడే హలీం, హరీష్ సెంటర్లు, ఫలహార విక్రయ దుకాణాలు వెలిశాయి. ఎంతో నిష్టతో ఉపవాస దీక్షలు చేసే ముస్లింలు పగలంతా నమాజ్, ఖురాన్ పఠనం, జికర్ (అల్లాహ్ స్మరణం) చేస్తూ ఉంటారు. సాయంత్రం 6 గంటల నుంచి ఇఫ్తార్ ఏర్పాట్లు మొదలు పెడతారు. చాలా మంది సులభంగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను తీసుకుంటారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నగరంలోని వన్ టౌన్, పెద్ద మార్కెట్, పూలబజార్, వడ్డేగేరి తదితర ప్రాంతాల్లో వాటి కొనుగోలు దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

- కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ



మాట్లాడుతున్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఆయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ సూచించారు. శుక్రవారం ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) కార్యక్రమం ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్లకు అవగాహనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ 'ఎన్నికల పర్వం దేశానికి గర్వం' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. అర్హత ఉన్న యువతకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు మెప్మా సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లకు స్వీప్ ద్వారా నిరంతరం ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ఓటు విలువ తెలియజేసేందుకు సాంస్కృతిక, కళాజాతా, ముగ్గుల పోటీలు నిర్వహించి చైతన్యం చేయాలన్నారు. ఈక్రమంలో ప్రత్యేకించి ఫలానా పార్టీకి, ఫలానా గుర్తుకు ఓటు వేయాలని చెప్పరాదన్నారు. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారాల్లో అధికారులెవరైనా పాల్గొంటే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, మెప్మా పీడీ నాగశివలీల, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మురళీ, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు పెంచలయ్య పాల్గొన్నారు.

సెపక్‌తక్రాలో ఆర్‌యూ జట్టుకు కాంస్యం



కాంస్య పతకం సాధించిన యూనివర్సిటీ జట్టు

కర్నూలు (టౌన్): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పురుషుల సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ జట్టు కాంస్య పతకం సాధించింది. ఈనెల 17 నుంచి 20 వరకు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో రాయలసీమ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సెపక్‌తక్రా పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో రేగు ఈవెంట్‌లో వర్సిటీ కాంస్య పతకం సాధించినందుకు జట్టు సభ్యులను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అంకన్న పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య



రంగనాయకులు

కర్నూలు: ఆటో డ్రైవర్ బోయ రంగనాయకులు (40) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోనెగండ్ల మండలం అగ్రహారం గ్రామానికి చెందిన రంగనాయకులు, సుగుణ దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి పదేళ్ల క్రితం కర్నూలుకు వలస వచ్చి నిర్మల్ నగర్‌లో నివాసముంటున్నారు. రంగనాయకులు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. గురువారం తన తండ్రి వద్ద డబ్బు తీసుకువస్తానని భార్య సుగుణ పుట్టింటికి వెళ్లింది. రాత్రి 8 గంటల సమయంలో రంగనాయకులు ఇంట్లో ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఇదే విషయాన్ని భార్య సుగుణకు సమాచారం అందించడంతో ఆమె ఆసుపత్రికి చేరుకుంది. అప్పటి కే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీ కేంద్రానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.

అక్రమ మద్యం సీజ్



అక్రమ మద్యం చూపుతున్న సీఐ

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యంపై సెబ్ పోలీసులు నిఘాను తీవ్రతరం చేశారు. కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా విస్తృత తనిఖీలు నిర్వహించి 126 మద్యం బాటిళ్లు సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి కొనుగోలు చేసి పల్లెల్లో రహస్య ప్రాంతంలో దాచివుంచి ఎక్కువ ధరలకు విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామానికి చెందిన కురువ లక్ష్మీదేవి వద్ద 48 మద్యం బాటిళ్లు, అదే గ్రామానికి చెందిన మండ్ల దస్తగిరి నుంచి 30 మద్యం బాటిళ్లు, ఉప్పలపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు నుంచి 48 మద్యం బాటిళ్లు కలిపి మొత్తం 126 బాటిళ్లను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్‌ను ఏపీఎన్‌జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి కోరారు. శుక్రవారం సాయంత్రం డీఎంహెచ్ఓను ఏపీఎన్‌జీఓస్ నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంగళ్ రెడ్డి మాట్లాడుతూ ఏఎన్ఎంలకు యాప్‌ల కష్టాలు తొలగించాలని, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జవహర్ లాల్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణుడు, తాలూకా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ సాయిరాం, మధుసూదన్, కోశాధికారి హరికృష్ణగౌడ్, సిటీ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, ఉమెన్ వింగ్ చైర్మన్ అరుణ కుమారి, సెక్షన్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మెడికల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

25న అయ్యప్ప స్వామి పడి పూజ

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని భాస్కర్‌నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 25న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9 నుంచి అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకం, జయశేఖర్ గురుస్వామి, హరినారాయణ గురుస్వాముల ఆధ్వర్యంలో భజన, 12 గంటలకు పడిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఇస్కాన్‌లో 'గౌర పూర్ణిమ' వేడుకలు

ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈనెల 25న భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో గౌర పూర్ణిమ వేడుకలు నిర్వహించనున్నట్లు కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు.

ఇంతియాజ్‌ను గెలిపించుకుందాం





కొత్తపేటలో ఇంతియాజ్, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించిన స్థానిక నాయకులు, పూల మార్కెట్ ఇఫ్తార్ విందులో హఫీజ్‌ఖాన్, ఇంతియాజ్ తదితరులు

- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ అభ్యర్థి ఇంతియాజ్‌ను గెలిపించుకుందామని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం 50 వ వార్డు ఎన్‌ఆర్ పేటలో ఇంతియాజ్‌తో కలిసిన వారు ఇంటింట ప్రచారం నిర్వహించారు. జగనన్న చేపట్టిన సంక్షేమ పాలనను వివరించారు. కరపత్రాలు అందజేశారు. పేదల ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఇంతియాజ్, హఫీజ్‌ఖాన్, ఎస్వీ మోహన్‌రెడ్డిలను స్థానిక నాయకులు గజమాలతో సత్కరించారు.

ఇఫ్తార్ విందులో..

స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద పూలమార్కెట్‌లో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో కలిసి ఇంతియాజ్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి దువా చేశారు. కార్యక్రమంలో 1వ వార్డు కార్పొరేటర్ షాషావలి, జిల్లా యూత్ అధ్యక్షులు సితార ఇర్ఫాన్, పూల మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.అలాగే కొత్తపేటలోని సుల్తానియా మసీదులో నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డితో కలిసి ఇంతియాజ్ పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్



జనవిజ్ఞాన వేదిక సభ్యులతో మాట్లాడుతున్న ఇంతియాజ్

అవకాశమిస్తే కర్నూలును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతానని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. శుక్రవారం బిర్లా కాంపౌండ్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఏఎస్‌గా రాష్ట్ర స్థాయిలో ఎన్నో ఉన్నత స్థానాల్లో పనిచేశానని, పాలన పరంగా అభివృద్ధి పరంగా అనుభవం ఉందని, తనను గెలిపిస్తే కర్నూలును మహా నగరంగా తీర్చిదిద్దుతానని జనవిజ్ఞాన వేదిక సభ్యులను కోరారు. తుంగభద్ర, హంద్రీ, కేసీ కెనాల్ నదులు ఉన్నందున వాసులకు తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా పక్కా ప్రణాళికలు రూపొందిస్తానన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తేర్నేకల్ సురేందర్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక సభ్యులు ప్రతాప్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, శివరామిరెడ్డి, శేషాద్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శని త్రయోదశి పూజలు

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామంలోని శనేశ్వర స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి పూజలు నిర్వహించనున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షులు డీవీ రమణ పేర్కొన్నారు. ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు భక్తులు తమ స్వహస్తాలతో స్వామివారికి తైలాభిషేకం చేసే అవకాశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూజా సామగ్రి అంతా దేవస్థానం వారే ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 33వ వార్డులో ఇంటింట ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. చంద్రబాబు మాటలు నమ్మొద్దని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నరసింహులు, నాయకులు రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లకు సున్నం వేశారు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (న్యూటౌన్): ఈనెల 21న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'కల్లూరులో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన' కథనంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన అధికారులపై సీరియస్ అయ్యారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నా గోడలపై ఉన్న పోస్టర్ల తొలగింపులో అలసత్వం పనికిరాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత కల్లూరులో ఇంటింటికీ అతికించిన పోస్టర్లను వెంటనే తొలగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజను ఆదేశించారు. ఆయన సూచనలతో ఎన్నికల, నగర పాలక సంస్థ సిబ్బంది పరిసర ప్రాంతాలకు వెళ్లి పోస్టర్లకు సున్నం వేయించి కనిపించకుండా చేశారు.

ఆర్‌యూలో ఇన్వర్టర్లు మాయం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఇన్వర్టర్లు మాయమైనట్లు వర్సిటీ ఉన్నతాధికారులు గుర్తించారు. ఆరు నెలల క్రితం కంప్యూటర్ ల్యాబ్స్‌కు సంబంధించి సుమారు 80 ఇన్వర్టర్లు బయటికి తరలించి మాయం చేసినట్లు తెలుసుకున్న వర్సిటీ ఉన్నతాధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నాగుల అంకన్న మాట్లాడుతూ సుమారు రూ.2 లక్షల విలువ చేసే కొన్ని ఇన్వర్టర్లు మాయమైనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీసీ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీస్‌లకు ఫిర్యాదు చేశామన్నారు. విచారణలో పూర్తి విషయాలు తెలుస్తాయని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులూ.. ఇంకెప్పుడు మేల్కొంటారు?



కోడ్ అమలు విషయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రతి రోజూ తగిన సూచనలు,ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే ఇప్పటికీ నగరంలోని పలుచోట్ల టీడీపీకి చెందిన బ్యానర్లు, ఎన్టీఆర్ విగ్రహాల విషయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పత్రికలు వెలుగులోకి తీసుకొస్తున్నా మీనమేషాలు లెక్కిస్తున్నారు. నగర నడిబొడ్డున గాయత్రి ఎస్టేట్ వద్ద టీడీపీ కార్యాలయం ముందున్న నిలువెత్తు ఎన్టీఆర్ విగ్రహానికి కోడ్ అమల్లోకి వచ్చి వారం రోజులు అవుతున్నా ముసుగు వేయాలనే ఆలోచన అధికారుల్లో కలగకపోవడం గమనార్హం. నిత్యం అధికారులు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో శుక్రవారం ఆ పార్టీ నేతలు ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నా అధికారులకు కోడ్ గుర్తుకు రాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు